అమ్మకడుపు చల్లగా...

– గొల్లపూడి మారుతీరావు

(గత సంచిక తరువాయి)

నా సినిమా వ్యాసంగం గురించీ, నా అభివృద్ధిని గురించి కాకిగోల ఎక్కువయింది. ఉన్నది తెలుగుదేశంలో కావలసినంతమంది కిట్టని వాళ్ళుంటారు. ఉన్నారు. అప్పటికి రేడియోలో అన్ని రూల్సునీ అతిక్రమించి ఉంటాను. ఈ సందర్భంలో మారుతీరావుని శిక్షించడం ఎలా? నాకు ప్రమోషన్ ఇవ్వడం, తత్కారణంగా నేను కాదనలేని బదిలీని ఇవ్వడం.

నా ప్రియతమ స్టేషన్ డైరెక్టర్‌గారు అష్వాక్ హుస్సేన్‌గారు హైదరాబాదు బదిలీ అయిన సందర్భంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభకి హైదరాబాదు నుంచి ఆదరాబాదరగా వచ్చి హాజరయాను. ఆయన స్థానంలో స్టేషన్ డైరెక్టరుగా వచ్చిన బాలాంత్రపు రజనీకాంతరావుగారు కూడా ఆ సభలో ఉన్నారు. నన్ను చూస్తూనే అష్వాక్ హుస్సేన్‌గారు పిలిచి నాకు అభినందనలు తెపిపారు. నాకర్థంకాలేదు. అప్పుడు చెప్పారు నాకు ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా ప్రమోషన్ ఇచ్చి శంబల్పూరు బదిలీ చేశారని. దీనికి ఆనందించాలో బాధపడాలో అర్థంకాలేదు. ఏమయినా ప్రమోషన్‌కి ఎగిరి గంతేసే ఉద్యోగి పరిస్థితి కాదు నాది. నా దృష్టిలో ఉద్యోగం మీద, అక్కడి ఆదాయం మీదా లేదు. ఏమయినా ఈ వార్త విని కాస్సేపు షాకయ్యాను. అయితే ఏ చిన్న పిసరో ఆనందమూ లేకపోలేదు.

నన్ను ఉద్యోగం రాజీనామా చెయ్యమన్నవాళ్ళు ఎక్కువయిపోయారు – కొమ్మూరి, నవభారత్ ప్రకాశరావు, కాట్రగడ్డ నరసయ్యలాంటివారు. ఒక్కటి మాత్రం నిజం. మిగతా బదిలీల్లాగ కాకుండా శంబల్పూరు వెళ్తే పూర్తిగా సినీరంగానికి దూరమయిపోతాను.

ఉద్యోగం వదలవద్దని గొడవచేస్తూ కంటతడి పెట్టుకున్న వ్యక్తి మా ఆవిడ.

నార్లగారన్నారు: ఇంకా సినిమాలో స్థిరపడకపోతే తొందరపడకండి – అని. ఏమాత్రం కాలు నిలిచినా ఉద్యోగాన్ని మానెయ్యవచ్చునన్న ఆలోచన వారి మాటల్లో ద్యోతకమయింది.

సినారె అన్నారు: పరవాలేదు. శంబల్పూరు వెళ్ళండి. మేం అంతా ఉన్నాం కదా. ఆరునెలల్లో వెనక్కు రప్పించేస్తాం.

రావూరుగారు కలిశారు: ఒక్కసారి రండి. ప్రేయసీ ప్రియుల్లాగ కబుర్లు చెప్పుకుందాం – చాలా రోజులయింది కలిసి.

ఎందుకనో రాజీనామా చెయ్యాలనే నిర్ణయించి కాగితాన్ని పట్టుకుని స్టేషన్ డైరెక్టర్ బాలాంత్రపు రజనీకాంతరావుగారి గదిలోకి వెళ్ళాను. ఆయన నాకు బాగా పరిచితులు. హైదరాబాదులో కలిసి పనిచేశాం.

నా రాజీనామా కాగితాన్ని చదివి అడ్డంగా చింపేశారు. "రాజీనామా లేదు ఏం లేదు. శంబల్పూరు వెళ్ళండి. పై ప్రాంతాలలో పనిచెయ్యడం మంచి అనుభవం. అంతగా ఉద్యోగం ఆటంకమయితే అప్పుడు చూద్దురుగాని" అని నా మీమాంసకి ముగింపు చెప్పారు.

1971 జులై 10. అర్ధరాత్రి. నాకు తెలియని, ఏనాడూ చూడని ఒరిస్సాలో శంబల్పూరుకి బయలుదేరాను. సంపాదించుకున్న పరపతి, కూడదీసుకున్న సినిమా పరిచయాలూ, రచనా వ్యాసంగము అన్నీ అటకెక్కించి. ఆ రోజుల్లో అది తేలికయిన నిర్ణయంకాదు. శంబల్పూరు జీవితం నా కెరీర్‌ని ఎలా మలుపు తిప్పుతుందో తెలీదు. ఈ ఊపిరి తిరగని వ్యాసంగానికి ఇదే ముగింపా? తెలీదు. నేనూ, నా భార్య, ముగ్గురు పిల్లలూ – నాలుగే బెర్తులున్న పాత ఫస్టుక్లాసు కంపార్టుమెంటు మా గది.

స్టేషన్‌లో ఈడ్పుగంటి లక్ష్మణరావు, నండూరి సుబ్బారావు, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, కొమ్మూరి వేణుగోపాలరావు, నవభారత్ ప్రకాశరావు, మరికొందరి సన్నిహితులూ ఉన్నారు. కొందరి కళ్ళలో నీళ్ళు, కొందరి కళ్ళలో కోపం – ఓ మంచి కెరీర్‌ని నిర్దాక్షిణ్యంగా వదులుకుపోతున్నానని.

రైలు చీకట్లోకి ప్రయాణం చేసింది. మా ఆవిడా, పిల్లలూ హాయిగా నిద్రపోయారు. అర్ధంకాని, స్పష్టతలేని భవిష్యత్తులో నా పాత్రని వెదుక్కుంటూ – నిద్రలేకుండా కూర్చున్నాను. రైలు వెళ్తూనే ఉంది.

10

ప్రధాని నెహ్రూగారి మూడు అందమైన కలలు – నాగార్జునసాగర్, హీరాకుడ్, భాక్రానంగల్. ఇంతే తెలుసు నాకు. రాత్రి 9గంటలకి హీరాకుడ్ అనే చీకటి ముసిరిన స్టేషన్ దాటి యిక శంబల్పూరు రాబోతుందని మేం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాం. మెల్లగ తుంపర్లుగా ప్రారంభమైన వర్షం ముదిరింది.

శంబల్పూరులో రైలు ఆగింది. స్టేషన్‌లోనికి వచ్చేటప్పుడు బోర్డువినా ఏమీ సాక్ష్యంలేదు – అది శంబల్పూరు అని చెప్పడానికి. స్టేషన్ అంతా నిర్మానుష్యం. దాదాపు 28–30 వస్తువులు నా కంపార్టుమెంట్‌లోంచి దిగాలి. మరో 20 సామాన్లు – స్కూటర్, మంచాలు వగైరా లగేజీతో దిగాలి. అక్కడ రెండు నిమిషాలు రైలు ఆగుతుంది. పోర్టర్లు ఎవరూ

లేరు. ఎవరితో మాట్లాడాలో తెలీదు. పిల్లల్నీ, సామాన్లనీ దించడం ఎలా? ప్లాట్ ఫారం మీద పరుగులు తీశాను. స్టేషన్ మాస్టరుగారు భద్రంగా తమలపాకులు ఎవరి దగ్గర్నుంచో అందుకుంటున్నారు. నా కష్టాలు చెప్పాను. ఎవరైనా పోర్టరు ఉంటే దించుకోండి అని భయంకరమైన ఇంగ్లీషులో చెప్పాడు. మరి లగేజీ మాట? ఆయనకేం తెలీదు. ఇక్కడ దించటానికి ఆఖరి రూపాయి చెల్లించాను. మళ్ళీ కంపార్టుమెంటు దగ్గరకి పరుగున వచ్చాను. అప్పటికి ఆదరాబాదరాగా కంపార్టుమెంటులో సామాన్లు దించాం. అన్నీ వర్షంలో తడిసిపోతున్నాయి. కంపార్టుమెంటు దగ్గరకి వస్తూనే మళ్ళీ మా ఆవిడని కంపార్టుమెంటు ఎక్కించాను. "చైన్ లాగి పట్టుకో. ఈ రైలు నేను చెప్పాకే కదులుతుంది" అని అరిచాను. వర్షంలో తడిసిన పరుపుచుట్ట మీద కూర్చున్నాను. గార్డు విజిల్ వేశాడు. స్టేషన్ మాస్టర్ జెండా ఊపాడు. రైలు కదలలేదు. గార్డు, అండర్ గార్డు, స్టేషన్ మాస్టర్ అంతా పరుగున వచ్చారు. నాకు గొడుగు పట్టారు. ఒకరు బ్యాటరీ లైటు వేశారు.

"నేను గెజిటెడ్ ఆఫీసర్ని. రైల్వే రైలు కదలదు" అన్నాను. ఆ రోజు రైలు ఏడెనిమిది నిముషాలు ఆగిన గుర్తు. అన్నీ సామాన్లు టిక్కులు పెట్టి మరీ అప్పగించారు. రైలు వెళ్ళింది. అప్పటికి రాత్రి పది. ఊళ్ళోకి ఎక్కడకి వెళ్ళాలి? ఈ రాత్రి ఎక్కడ ఉండాలి. ఎవరో ఏదో హోటల్ పేరు చెప్పారు. అందరం రిక్షాలు ఎక్కాం. చీకటి రోడ్ల మీద అంతుపట్టని ఊరులో, అర్ధంకాని చోటుకి రిక్షాలు వెళ్తున్నాయి. కంటతడి పెట్టి నన్ను శంబల్పూరు లాక్కొచ్చిన మా ఆవిడ భోరుమంది. అది శంబల్పూరు జీవితానికి కేవలం ప్రారంభం.

ఒరిస్సా చాలా విధాలుగా వెనుకబడిన ప్రాంతం. (నేను చెప్పేది 36 సంవత్సరాల క్రిందటి మాట) అప్పటికి ఆకాశంలో వెళ్ళే విమానాల్నే తప్ప, రైలు బండిని చూడని గ్రామాల వారున్నారు – రఢాకోల్, అంగూల్ వంటి ప్రాంతాలవారు. తెలుగు రైతులు బర్గడ్‌లాంటి ఊళ్ళకి చేరి చాలా తక్కువ ధరలకి పొలాలను కొని, అక్కడివారు ఊహించలేనంత అపూర్వంగా పంటలు పండించారు. అప్పటి కృషిపండిట్ బహుమతిని అందుకున్న వ్యక్తి తెలుగువాడు – పేరు ఆనందరావు. కృష్ణాజిల్లా చౌదరి. అత్తాకోడలంచు పంచె కట్టుకుని శంబల్పూరు మోటారు సైకిలు మీద రావడం నాకు గుర్తుంది. రాయగడలో చిన్న కునుకు పట్టి కళ్ళిప్పితే – బర్గడ్‌లో మళ్ళీ తెలుగుదేశంలో ఉన్న భావన కలిగేది.

అభివృద్ధిని సాధించిన వారిని చూసినప్పుడు యిక్కడివారు కాస్త అనుమానంగా చూస్తారు. చిన్న తేడా కనిపిస్తే ఎదురు తిరుగుతారు. ఆ ఒక్క మార్గాన్నే తమ హక్కునీ, తమ అస్తిత్వాన్ని నిలదొక్కుకోవచ్చునని భావిస్తారు. చాలా చిన్న విషయాలకి కోర్టుకెక్కుతారు.

అక్కడ ఉన్న రోజుల్లోనే ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా నేను ఓ లాయరుగారికి కాంట్రాక్ట్ ఇచ్చి దాన్ని ఉపసంహరించినట్టు తెలియజేయలేదని నా మీద కేసు పెట్టారు. అందుకు ప్రతిఫలంగా ఆయనకి కేవలం ఒక్క రూపాయి

ముట్టచెపితే చాలు కాని కాంట్రాక్ట్ వెనకనే రాసి ఉంటుంది. కాని కేసు పెట్టడం తన కోపాన్నీ, తన అస్తిత్వాన్ని నిలుపుకోవడం.

ఆ రోజుల్లో కటక్ లాయర్ల మీద ఒక జోక్ ఉండేది. కోర్టు ఆవరణలో కొన్ని కాకులు వాలి ఉన్నాయట. ఒకాయన పక్కన ఉన్న నీటిలో చిన్న రాయి విసిరాడు. కాకులు ఎగిరిపోయాయి. వెంటనే ఒక లాయరు అతన్ని పట్టుకున్నాడట. రాయి విసరడం వల్ల "సర్కారు" కాకులు 8 ఎగిరిపోయాయి కనుక దానికి మూడేసి రూపాయల చొప్పున 24 రూపాయలు చెల్లించాలని" ఎవరికి? తనకే! మరో ఆలోచన లేకుండా ఈయన 24 రూపాయలు యిచ్చేశాడట. ఆ పక్కన ఉన్న పెద్దమనిషి తెల్లబోయి "అదేమిటయ్యా – అలా యిచ్చేశావు" అన్నాడుట. ఈయన ఫక్కున నవ్వి "నిజానికి 15 కాకులు ఎగిరిపోయాయి. నాకు ఏడు కాకులు లాభం" అన్నాడట.

ఇది కేవలం జోకే కావచ్చు. కాని నా మీద పెట్టిన కేసుకీ దీనికీ పెద్ద తేడా లేదు. మొత్తం మీద ఎక్కువమందిలో ఆత్మన్యూనతా భావం కనిపిస్తూంటుంది కొట్టొచ్చినట్టు.

అయితే ఈ పరిశీలన ఇక్కడనే ముగించాల్సి ఉంటుంది. సాహితీ, సాంస్కృతిక, కళావైభవంలో జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన సంస్కృతి ఆ రాష్ట్రానిది.

సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్ అనే విదేశీ పరిశోధకుడు లాటిన్‌లో గీతగోవిందాన్ని ఉదహరించిన దాఖలాలున్నాయి. దాదాపు 900 సంవత్సరాల క్రితం ప్రేయసిలో శృంగారాన్ని రాధాకృష్ణుల మధ్య భక్తి వైభవాన్ని చిత్రించిన అపూర్వమైన సాహితీ సృష్టికర్త జయదేవునిది ఒరిస్సా. ఉత్కళదేశంలో (ఒరిస్సా) జగన్నాధక్షేత్రానికి సమీపంలో ఉన్న బిందుబిళ్ళమనే గ్రామం జయదేవునిది.

నేను 1961 ప్రాంతంలోనే జయదేవుని అష్టపదుల పుస్తకం తెచ్చుకుని (అప్పటికి నా వయస్సు 22) చదువుకుని మురిసిపోయేవాడిని. ఓ విధంగా చదువుకోవలసిన, మురిసిపోవలసిన వయస్సు అదేనేమో

అద్భుతమైన ఊహా చమత్కృతి గల ఈ శ్లోకం దగ్గర ఎప్పుడూ నా ఆలోచనలు ఆగిపోయేవి.

హృది బిసలతాహారో నాయం భుజంగమనాయకః

కువలయదళ శ్రేణీ కంఠే న సా గరళద్యుతిః

మలయజ రజో నేదం భస్మ ప్రియారహితేమయి

ప్రహరసి హరభ్రాంత్యానంగ! క్రుధాకిము ధావసి?

కవి మన్మధుడిని నిలదీస్తున్నాడు. ఏమయ్యా! నా మీదకి దూకుతావు? నేను శివుడిని కాను. (ఓసారి ఆయన మీద దూకి భంగపడ్డావు కదా!) నా రొమ్ము మీద నుండేది విరహతాపం చల్లారడానికి మీద వేసుకున్న తామరతూళ్ళ దండ సర్పం కాదు. నా మెడలో నల్ల కలువరేకుల దండ ఉంది – విషకాంతి కాదు. నా శరీరం మీద ఉన్న గంధపు ధూళి కాని బూడిద కాదు.

మహోత్కృష్టమయిన 'శయ్య' ఇది. శారీరకమయిన సుఖంలో తలమునకలయిన ఓ విరహ తప్తుడిలో శివతత్వాన్ని చూసే మహనీత్యత – జయదేవుడిది. ఈ రేంజ్ అనన్య సామాన్యం.

మరో 650 సంవత్సరాల తరువాత ఆంధ్రదేశంలో మరో వాగ్గేయకారుడు అన్నమయ్య. మళ్ళీ అలాంటి రచనలు చేశాడు. వీటికి సామ్యం ఏదైనా ఉందా? స్ఫూర్తి ఉన్నదా? ఇది పరిశోధకులు తేల్చవలసిన విషయం. ఇక కోణార్క్‌లో సూర్యదేవాలయం మీద శృంగార శిల్ప వైభవం అనూహ్యం. అటు ఉత్తరదేశంలో ఖజురహో శిల్పాలు, కోణార్క్‌లో శిల్పాలు ఇవన్నీ జాతి వైచిత్రకమైన ఆలోచనా సరళినేమయినా చెప్తున్నాయా? దేవాలయాల్లో బూతుబొమ్మల్ని విశ్లేషించిన తాపీ ధర్మారావు, నాయుడుగారి వంటివారు పరిశోధన జరపాల్సిన విషయం. అలాగే ప్రత్యేకమైన నృత్యప్రక్రియ ఒరిస్సీ – తర్వాత తర్వాత దాన్ని ఒడిస్సీ అని పిలుచుకోవడం జరిగింది.

నాకు తెలిసి సమ్యుక్త పాణిగ్రాహి ఒడిస్సీ నృత్యం, ద్వారం నాయుడుగారి శిష్యుడు, అప్పట్లో కటక్ రేడియో విద్వాంసులు భువనేశ్వర్ మిశ్రాగారి వయోలిన్ యిలా చాలా రంగాలలో ఆ రాష్ట్రపు కళావైభవం ప్రతిఫలిస్తుంది.

పరాయి ప్రాంతాలనుంచి వచ్చిన వారు ఇక్కడ నిలద్రొక్కుకోవడం వారి అవకాశాలను లాగుకోవడం వంటివి జరుగుతాయని స్థానికులు భావిస్తారు. కనీసం అలా భావిస్తారని పై ప్రాంతాల వారు భావించడం నా అనుభవం. ఆంధ్రదేశం నుంచి వచ్చిన నాలాంటివారికి ఎక్కడ తెలుగు మాటయినా వినిపించలేదని నేనూ, మా ఆవిడా తొలిరోజుల్లో వాపోయిన సందర్భాలున్నాయి. అయితే ఉద్యోగరీత్యానో, వ్యాపకాల రీత్యానో అక్కడా అక్కడ ఉన్న తెలుగువారిని సంఘటితం చేయాలనే ఆలోచన నేను చేశాను. వచ్చిన పదినెలలకి మొదటి ఉగాది పండుగ జరిపించాను. శంబల్పూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ శ్రీనివాస్ సాహూ లోగడ గుంటూరులో పనిచేసిన మనిషి. ఆయనని ముఖ్య అతిథిగా పిలిచాను. ఇక్కడ ఎదురైన ఒకే ఒక్క సంఘటన నా అభిప్రాయాన్ని బలపరిచింది. గవరయ్యగారని ఒక తెలుగాయన్ని ఉగాది ఉత్సవానికి పిలవడానికి వెళ్ళాం. మా కరపత్రం చూసి మా మీద చర్రున లేచాడు.

"ఎందుకయ్యా ఈ గొడవ? మేమేదో హాయిగా మా జీవితాన్ని గడుపుతున్నాం. ఇలాంటివేవీ తలపెట్టి మా ప్రాణం తియ్యకు" అని విసుక్కున్నాడు.

ఇది ఆనాటి ప్రవాసాంధ్రుల – కనీసం కొందరి – స్పందన.

ఏమైనా నేను శంబల్పూరులో ఉన్న 22 నెలల్లో ఒకే ఉగాది ఉత్సవం జరిగింది. ఆ తర్వాత మరెప్పుడూ ఎవరూ జరపలేదని విన్నాను. తెలుగువారి 'కలుపుగోరు' తనానికి యిది మచ్చుతునక. ప్రవాసంలో 'తెలుగుబాధ'ని వ్యక్తీకరిస్తూ – ఒక కథానిక – చాలా సంవత్సరాల తర్వాత వ్రాశాను "బాబాయి". అది నాకిష్టమైన రచన.

ఉక్కిరిబిక్కిరయ్యే నా వృత్తిలో ఉంటూ సినీరంగంలో అప్పుడే నిలదొక్కుకుంటున్న నాకు ఈ శంబల్పూరు జీవితం నిజమైన ప్రవాసం. మా పిల్లల్ని సెంట్రల్ స్కూలులో చేర్చడానికి వెళ్ళాను. ప్రిన్సిపాల్ తెలుగువాడు కాకపోయినా నాలాగే ప్రవాసంలో ఉన్న వ్యక్తి – తమిళుడు. షణ్ముగం ఆయన పేరు. అతి హుషారైన మనిషి. ఆయన వెంటనే నా సాధకబాధకాల్ని గ్రహించాడు. "ముందు సెటిలవ్వండి – మరేం పరవాలేదు. మీ పిల్లలకి సీట్లు యిస్తాను" అన్నారు. చుట్టూ చాలామంది ఉన్నారు. ఈ మాటల్లో నా పేరు వ్యాపించి ఉండాలి.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments